కథానిక

# పండిత పుత్రుడు

మునిపల్లె రాజు

దుర్గారావుపంతులుగారు ఆరోజున అద్దంచూచుకోటం పదవసారి. నలభయ్యోపడిగూడా దాటిపోతున్న పంతులుగారి చర్య ఆక్షేపణీయమైందని పదిమందీ అనవచ్చుగాని, జుట్టు మీసాలు నెరసిపోతూండటం పదిమందికీ కాదుగా. హఠాత్తుగా వచ్చిన అంటువ్యాధివలె—యీ ఫలితకేశాల జబ్బు దుర్గారావుపంతులుగారినే పట్టుకొన్నది. పంతులుగారు జుట్టుకు రంగు వేసుకొన్నారుగాని ఆఫీసులో అందరూ దాని ఆనవాళ్ళు పట్టేశారు. ఆయనకు తలకొట్టేసినంత పని అయింది. గుండెలో దిగులుపట్టుకొన్నది-వర్షాకాలంలో జలుబులాగా. పదిమందీ నవ్వుతున్నారనిగాదు-నవ్విన వాళ్ళ పళ్ళే బయటబడతాయి, అందుకుగాదు. తను వృద్ధుడైపోతున్నానని. దానివల్ల దుర్గారావుపంతులుగారికి స్మశాన వైరాగ్యం అంకురించింది. ఒకటిరెండుసార్లు దేవాలయానికిపోయి చెన్నకేశ్వడిచుట్టూ ప్రదక్షిణ చేసి, యింటికివచ్చి ఫలహారం మాత్రమే భుజించి వుపవాసంవున్నామని కూడా అనిపించారు. కాని ఆయనదిగులు తీరలేదు. ఇది పైపై కారణాలవల్ల వచ్చినదిగులుకాదుగదా-ఇట్లేవచ్చి అట్లేపోటానికి.

దుర్గారావుపంతులుగారింటికి బోర్డులేదుగాని ఆయన సర్కారు ట్రెజరీకి క్యాషియర్. మన పూర్వీకుల రోజుల్లో మహారాజుల ట్రెజరీలకు క్యాషియర్లుగా వున్నవారిని కోశాగారాధ్యక్షులనీ, ఇంకా చిన్నరాజుల వుద్యోగిని కోశాధిపతి అనీ, ఇంకా మరీ సన్నకారు రాజయితే, కోశాధికారి యనీ, అంటుండేవారు. పంతులుగారి తండ్రి హయాంలో ఆయన పద్మాపురం ఎస్టేటుకు దివాన్ గిరీ చేశారు. ఆయన మహాపండితులు, వక్త, గొప్ప రసికులు. దానకర్ణులు కావటంలో దుర్గారావుగారికి పాత బిరుదులు (యింగువ కట్టిన గుడ్డవలె) మాత్రం మిగిలిపోయాయి.

దుర్గారావుగారు పండితులు గాదు, పండిత పుత్రులు మాత్రమే. (ఆయన బందరు వెళ్ళి ఆ రోజుల్లో పాత మెట్రిక్యులేషను మూడుసార్లుగా తప్పి వచ్చారు.) వక్తలు అసలే కారు. (ఆయన బహుమిత భాషి ) రసికత్వమంటారా- అది వంశపారంపర్యానుగతంగా వస్తున్నదిగనక యీ మహోన్నత సుగుణానికి మాత్రం తనుగూడా వారసుణ్ణే అనిపించుకున్నారు. వారు వివాహితులై ఇరవై ఏళ్ళే అయినా, పడుపువీధిలో విశాలాక్షితో వారి పరిచయం పాతికేళ్ళుదాటినదనే ఒప్పుకొని తీరాలి. ఇక దానపరాయణత అంటారూ, ఇదిగూడా పెద్ద వివాదాంశంమాత్రం కాదు. ఆయనే ఒప్పుకొన్నారు తన తండ్రిగారివలె ఆయనకు భట్రాజులను, ఆశుకవులను పోషింప శక్తిలేదని. అంతమాత్రంచేత ఆయన దాతృత్వాన్ని తమరు శంకించనక్కర్లేదు. భార్య అన్నపూర్ణమ్మగారికి పుట్టింటివారు పెట్టిన బంగారుసొమ్ములన్నీ వారు స్వయంగా తమ స్వహస్తాలతో, ఏ కీర్తినీ ఆశించకుండా, విశాలాక్షికి దానంచేశారు. పాత దివాన్ గిరీ హోదాకు తార్కాణంగా మిగిలిన మామిడితోటను కూడా, ముసలి తండ్రిగారు చనిపోగానే, బ్రాహ్మణులకు బదులుగా, విశాలాక్షికే భూదానంకింద దానపత్రం వ్రాసి రెండోకంటికి తెలియకుండా యిచ్చేశారు. చివరకు పెద్దకొడుకు బారసాలకు వచ్చిన కట్నాలు కూడా వారు విశాలాక్షికే ఖర్చుచేయించారంటే, వారి దాతృత్వాన్ని గురించిన తమరి అనుమానాలు, శంకలూ తీరిపోగలవని నమ్ముతాను.

ఆ దుర్గారావుపంతులుగారికే యిప్పుడు తల నెరసింది. ఆ దుర్గారావుపంతులుగారే ఆరోజున పదిసార్లు అద్దం చూచుకొన్నది, ఆ దుర్గారావుపంతులుగారే ఆరోజున కలెక్టరుగారి చెకింగు అయినా, లెక్కలు పూర్తిచెయ్యక దిగులుపడి కూర్చున్నది. ఆయనకు గాక మరెవరికీ బెంగ? అటు ఆస్తిపాస్తులన్నీ తిరుక్షవరం చేసుకొని, యిటు మూడురాళ్ళ సర్కారువుద్యోగం తప్పితే యిక రత్రా ఆధరువుల్లేక మీదుమిక్కిలి తలనెరసిన ఏ

పెద్దమనిషినండీ- ఏ విశాలాక్షైనా చేరదీసేది? మరి దిగులు బెంగా గాక యితరమేమున్నదీ! ఆరోజు సాయంత్రం, ట్రెజరీ ఆఫీసు తాళంచెవులు తాణాలో అప్పగిస్తూ—"ప్రభూ! ఏ పాపమూ ఎరగనివాణ్ణి. ఒకళ్ళకు అన్యాయంచేసి ఎరగనే. నాకే తెచ్చి పెట్టావా యీ పరీక్ష? నేను తట్టుకోలేనయ్యా, రామయ్య తండ్రీ!"అని వాపోయారు. ఆ ప్రార్థనే ప్రకాశంగా వారు అనివున్నట్లయితే పాషాణహృదయాలు గూడా కరిగివుండేవంటే నమ్మండి. కాని వారు తనలోనే ఆ ప్రార్థనను మననంచేసుకొని, విశాలాక్షి వీధివైపు దారితీశారు.

"ఆవులమంద కన్పించకుండాపోయిందా యేం? పంతులుగారు అంతగా దిగులుపడిపోతున్నారు"అంది విశాలాక్షి దుర్గారావుగారిని గుమ్మంలో చూడగానే.

పంతులుగారు కళ్ళజోడుతీసి ఘర్మజలం తుడుచుకొంటూ, కొత్త వేదాంతివలె తన చుట్టూ ఒకసారి పరికించుకొని, తిరిగి దిగాలుపడి, అదృశ్యమైన అనుమానంతో ఆమెను మళ్ళీ చూసి, ఏదో మాట్లాడబోయి గొంతు సవరించుకొంటూ, మాట రాక గద్గదికులైపోయి నిశ్చేష్టత వహించారు.

"ఏమిటండీ ఆ పిచ్చిబాగులవాడి చూపులు. విప్రనారాయణ సినిమాకు తీసుకువెళ్తామని చెప్పిన ప్రభువులేనా యీ ప్రభువులు? పదండి పదండి. యింకా టైంవుంది, ఆ సినిమా అయినా చూపించండి నగలూ నాణ్యాల్లూ లేకపోతే మానిరి" అని విశాలాక్షి పమిటె సవరించుకొన్నది.

ఇటువంటి పరిస్థితులకే పంతులుగారి సొంత దిగులుకు చిలవలూ పలవలూ పుట్టేది. ఈ మాయదారి సినిమాలువచ్చి మంచివాళ్ళ మనసుల్నే మాయలో ముంచుతున్నైయ్యే.

తప్పించుకోవాలని దుర్గారావుగారు ఆమాటా యీమాటా మార్చారు కాని లాభంలేకపోయింది. సినిమానుంచి జట్కాలో తిరిగివస్తున్నంత సేపూ విశాలాక్షి రిమార్కులు పాసు చేస్తూనే వచ్చింది. "ఆ కాంచనమాలే బాగా ఆడలేదట. ఆ విప్రనారాయణుడు ఎంత క్రూరవాడండీ" పంతులుగారు జెలసీతో మండిపోయారు లోలోపల. ఆరాత్రి తిండికి ఇల్లు జేరినప్పుడు గూడా ఆయన మౌనముద్రతోనే భుజించారు. సెలవలకు మేనమామగారింటికి వెళ్తాన న్న పెద్దకొడుకు విన్నపం ఆయన బొత్తిగా వినిపించుకోలేదు. మామూలు ధోరణిలోనే ఆయన చెయ్యి కడుక్కుంటున్నంత సేపూ భార్య ఆయనమీద సూటీలు పోటీలుగా ఆయన క్యారక్టరు కాండక్టులమీద పరువు నష్టం దావాదాకా వెళ్ళే మాటల్తో కొడుకును శాంతపరచింది. ఈ ఆడవాళ్ళ గొడవ ఎప్పుడూ యింతే అనిగూడా ఆయన అనుకోలేదు. అసలా ప్రపంచంలో లేడాయన.

విశాలాక్షికి యిద్దరు కూతుళ్ళు. ఇద్దర్నీ సంసారపక్షంలో వుద్యోగాలు చేసుకుంటున్న కులంవాళ్ళ కుర్రాళ్ళకిచ్చి పెళ్ళిచేసింది. తన కాలంలో సంపాదించిన నగనాణ్యం కూతుళ్ళకు పంచిపెట్టింది. పాతకాలాలనాటి ఒక నానుతాడు మాత్రం తను అట్టే పెట్టుకొన్నది—మొన్న మొన్నటిదాకా. చివరకు అదిగూడా మాటకారి చిన్నకూతురు లంకించుకు వెళ్ళిపోయింది. ఇఖబోసి మెడతోవున్న ఆడది గనక గొలుసు చేయించి పెట్టుండని, తన పంతులుగారినే గోముగా అడిగింది. రెండువేలు రొక్కం వున్నపళాన పుట్టించటం సాధ్యమా? కాదు. ముమ్మాటికీ కాదు.

ఇల్లు తాకట్టు పెడతానని ఆయన షావుకార్ల చుట్టూ తిరిగాడు. కాని అది పిత్రార్జితం వేరొక వారసుడున్నాడు. ఆ వారసుడికి తన భార్య గార్డియన్ అనగా రక్షకకర్త. పైపెచ్చు కిందటివారం దిన పత్రికల్లో "క్లయింటు తరఫున వకీలుగారొకాయన"—పంతులుగారు చెయ్యబొయ్యే "వర్తమాన అప్పుు" కొడుక్కు అంటువని ఒక చిన్న ప్రకటన చేశాడు. ఇల్లు తాకట్టుపడలేదు.

కొడుకు పెళ్ళికని చేబదుళ్ళు నోటుపత్రంమీద అడిగినా కొడుకు వయస్సు పదహారే అని ఎరిగిన వాళ్ళు అప్పిచ్చేదాతేలు అడ్డుపడ్డారు. పోనీ తీర్థయాత్రలు అన్నాడు పంతులుగారు. అప్పిచ్చువాడు—బ్రాహ్మణ షావుకారుగదా అని. నువ్వు రిటైరు అయిందాకా వుండవయ్యా, యిప్పుడే అంత వైరాగ్యం దేనికి అని దెప్పిపొడిచాడాయన.

ఆరోజున విశాలాక్షి యింట్లో జరుగుతున్న గొడవ పంతులుగారు వరండాలో వుండగానే చెవినబడ్డది.

"ఏం పంతులో, బోడిపంతులు" అన్నది విశాలాక్షి తల్లి.

దానికి విశాలాక్షి సమాధానం వినబడలేదు.

"ఆకు వక్క సున్నం దండగ" మళ్ళీ ఆతల్లి తన గొంతును లాంతరువత్తి హెచ్చరించినట్లు హెచ్చించింది. ఆయన కర్ణరంధ్రాల్లో యీ పలుకులు శూలములై గుచ్చుకొన్నవి. హరిహరీ విషమ పరీక్ష తెచ్చిపెట్టావుగా అని ఆయన వెనుదిగిరి గాడు గిరుక్కున.

ఆ మూడోరోజునే ట్రజరీలో రెండువేల రూపాయల రొక్కంతరుగు కనిపించింది తనిఖీలో. ఊరంతా గుప్పుమన్నది; ఆఫీసంతా గప్ మన్నది.

సర్కారు కోశాధిగారాధికారి శ్రీ దుర్గారావు పంతులుగారు మార్వారీ నగల దుకాణంలో బేరం చేస్తుండగా చాలామంది చూశామన్నారు. మరి కొందరు అక్కడో గుమాస్తా పరారీ అయినా డన్నారు. కొందరిది సబినస్పెక్టరు చేసిన పని అన్నారు. ఏమైతేనేం—వేశ్యమాత దుర్గారావు పంతులుగారికి నూత్నోత్సాహంతో స్వాగత మిచ్చింది. విశాలక్షి మెడలోని బోసి పోయింది.

కాని వారంటుమీద పంతులుగారిని సబ్ జైల్లో రిమాండుచేశారు. ఆయన ప్రార్థనేమో ఆయనే మోగాని ట్రెజరీ క్యాషియరుగారు పల్లెత్తుమాట అనలేదు. ఎవర్నీ.

పంతులుగారు అరెస్టుఅయిన ;మర్నాడే-వారింటికి ఆయన బావమరిది కేశవయ్యగారువచ్చి—జట్కాలో తోబుట్టువును, మేనల్లుడినీ తీసుకొని తన వూరు చక్కా తీసుకుపోయారు.

ఊళ్ళో పెద్దమనుషులు కొందరు దుర్గారావు పంతులుగార్ని అనాథగా జెయిలుకు కంపించ దలుచుకోలేదు. నలుగురూచేరి కలెక్టరు దొరవద్దకు రాయబారం వెళ్ళారు. "సంప్రదాయంగల కుటుంబీకుడు తమరు దయతలచాలి." అని ప్రార్థించారు.

కలెక్టరు అన్నాడు. "ఇప్పుడైనా కాజేసిన సొమ్ము కడితే శిక్ష తగ్గుతుంది. మీరు పదిమందీ తలకాయలు కలపండి." పెద్దమనుషులు ఎవరిదారిన వాళ్ళు వెళ్ళారు. మళ్ళీ ఆ విషయమై మీటింగు జరగలేదు.

పంతులుగారికి రెండేళ్ళు కఠినశిక్ష పడ్డది. వారి తీర్థయాత్రా వూహాగానం యీవిధంగా ఫలించింది మొదటి అఖండ గోదావరీ స్నానం వారికది అయితే కోర్టువారు ఒక కండిషన్ పెట్టారు- సర్కారు సొమ్ము కడితే శిక్ష ఆరుమాసాలే. దానికి కారణం వారే చెప్పుకొన్నారు. నిందితుడి ఆఫిషియల్ రికార్డు చాలా బాగున్నది. ఇదివరలో కేసులూ, గలాటాలులేవు. కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు అద్భుతంగా వున్నై. డబ్బు కట్టటానికి పక్షంరోజులు గడువు ప్రసాదించారు.

దుర్గారావుగార్ని చూచేందుకు జైలుకెవరూ పోలేదు. కాని పధ్నాలుగోరోజున **మాత్రం** కోర్టు ముందు జట్కా ఆగింది. ఒక నడివయస్సు స్త్రీ దిగింది. ఆమె కన్నులకు కాటుక. నెత్తిన మేలి ముసుగు. పంతులుగారి ఉంపుడుకత్తె అన్నారు వరాండాలోవున్న కోర్టు అమీనాలు. ఆమె మెడ బోసిగావున్నది.

**ఆ**ర్నెల్లు గడుస్తుండగానే పంతులుగారి తీర్థయాత్ర ముగిసింది. "ఇదేమిటి రెండేళ్ళవరకంగదా. తానీషాకు రామలక్ష్మణులు హర్కార్లు చెల్లించినట్లుగావుంది.-యీ తమాషా"అనుకొన్నాడు బాగా యీ ఆర్నెల్లలో తల నెరిసినాయన.

ఆయనతోపాటు జైల్లోవున్న యింకో ఫోర్జరీ దారుడు అందలి రహస్యాన్ని వివరించాడు.

"ఎందుకండీ అట్లావణికిపోతారు పంతులుగారూ. ఆ మహాతల్లే. లక్ష్మీసమానురాలు. మహాప్రతివ్రత-సావిత్రీ దమయంతుల వారసురాలు. వెళ్ళి యిక క్షమించమని,' మీ అర్థాంగి, అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య పాదాలమీద పడండి. పుస్తెతో గూడా అమ్మి, పసుపుకొమ్ము గట్టుకొని సర్కారు సొమ్ము గట్టింది ఆ మహాతల్లి. పొండి పొండి."

దుర్గారావు పంతులుగారు ఆ రాత్రిబండిలోనే ప్రయాణంచేసి బావమరిది యింటికి చేరారు మర్నాడు. వెళ్ళి దొడ్లో అంట్లు తోముతున్న భార్య మురికికాళ్ళమీద అమాంతంపడి "ఇకనైనా క్షమించలే నీ మనస్సు తెలిసింది ఇక తప్పు చెయ్యను" అన్నాడు.

ఆమె కోపంతో విదిలించుకొనలేదుగాని చాలాసేపు మాట్లాడలేదు. "మళ్ళీ ఏ ముఖంపెట్టుకొని వచ్చారంట" అన్నది చివరకు. ★